నమస్తే తెలంగాణ
జిందగీ 13
హైదరాబాద్ | శుక్రవారం 29 డిసెంబర్ 2023 www.ntnews.com

వార్తల్లో మనిషి



# అమ్మ మాట బంగారు బాట!

**ఫ్లెక్స్...** వివిధ బ్రాండ్స్ పేరుతో మార్కెట్‌ను ఏలేస్తున్న అనేక వస్తువులను ఉత్పత్తి చేసే కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ. ఈ రంగంలో అదే నెంబర్ వన్. ఇలాంటి ఓ కంపెనీకి భారతీయురాలు సీఈఓ కావడం విశేషం. ఆమె పేరు రేవతి అద్వైతి. తమిళనాడులోని ఓ మారుమూల పల్లెలో పుట్టి పెరిగారు. రేవతి ఫ్లెక్స్ పగ్గాలు చేపట్టిన సందర్భం అంత తేలికైంది కాదు. ముందు కొవిడ్ విరుచుకుపడింది. తర్వాత గ్రేట్ రెజిగ్నేషన్ పలకరించింది. ఆపై ఆర్థిక మాంద్యం దెబ్బతీసింది. ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. ఎటుచూసినా యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇన్ని ప్రతికూల నేపథ్యాల మధ్య సంస్థ వృద్ధిలో 17 శాతం ఎదుగుదల నమోదు అయ్యేలా చూశారు. 30 దేశాల్లో విస్తరించిన కంపెనీని మరింత అభివృద్ధి చేశారు. తన విజయం వెనుక మేనేజ్‌మెంట్ పట్టాలతోపాటు తల్లి నుంచి నేర్చుకున్న విలువలు ఉన్నాయని అంటారు. రేవతి తల్లి నిరక్షరాస్యురాలు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయారు. అయినా కుంగిపోకుండా అయిదుగురు కూతుళ్లను పెంచారు. ఆ పట్టుదలే రేవతికి అబ్బింది. కేవలం ఫ్లెక్స్ సీఈఓగానే కాదు... తన అపార నైపుణ్యంతో మరెన్నో గౌరవప్రదమైన హోదాల్లో కొనసాగుతున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సభ్యురాలిగా, ఎమ్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల సలహాదారుగా.. తనదైన ముద్ర వేస్తున్నారు.

Fashion



## ఇదే.. నా ఆకాంక్ష!

**ఆ**కాంక్ష రంజన్ కపూర్.. పరిచయం అవసరం లేని బాలీవుడ్ సౌందర్యం. తనిప్పుడు, తెలుగులోనూ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కుతున్న 'మాయావన్'లో నటిస్తున్నది. 'ఇప్పటికే తెలుగు ట్యూటర్‌ను నియమించుకున్నా. ప్రాక్టీస్ మొదలైంది. త్వరలోనే డబ్బింగ్ కూడా చెప్పేస్తానేమో' అంటున్నది ఆకాంక్ష. తెలుగు పరిశ్రమ కొత్తే కావచ్చు.. కానీ యూనిట్ సభ్యులు మాత్రం పాత పరిచయస్థుల్లానే అనిపిస్తున్నారట తనకు.

**సుచిత్ర సిన్హా..** ప్రభుత్వ అధికారి. అద్దాల క్యాబిన్‌కు, ఎయిర్ కండిషన్డ్ కారుకు పరిమితమైపోయినా ఆమె జీతం ఆమెకు వచ్చేది. ఆమె ప్రమోషన్లు ఆమెకు అందేవి. కానీ, సుచిత్ర కారు దిగారు. కొండకోనల బాట పట్టారు. జార్ఖండ్‌లో అంతరించిపోతున్న తెగను అక్కున చేర్చుకున్నారు. వారితో 'అమ్మా' అనిపించుకున్నారు. పేరు పక్కన ఐఏఎస్ అనే మూడు ఆంగ్ల అక్షరాల కంటే.. ఆ రెండక్షరాలే తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని అంటారు సుచిత్రాజీ.





# అందరి అమ్మ!

**'అమ్మా..'**

ఒకరిద్దరు పిల్లలు పిలిస్తేనే తల్లి సంతోషిస్తుందే. అదే, వందల గొంతుకలు ప్రేమగా పలకరిస్తే, గౌరవంగా సంబోధిస్తే.. ఆ స్త్రీ మూర్తి జీవితం ధన్యం. జార్ఖండ్‌లోని సబర్ తెగకు సంబంధించినంత వరకు సుచిత్ర సిన్హా.. అమ్మ కాదు, అమ్మలగన్న అమ్మ. చాలా పెద్దమ్మ. పూరిగుడిసెల్లోని దేవుని గూటిలో ఆమె ఫొటో ఉంటుంది. నిజమే, తల్లి జన్మనిస్తే, ఈ తల్లి పునర్జన్మనిచ్చింది. తల్లి బతుకును ప్రసాదిస్తే.. ఈ తల్లి బతకడం నేర్పింది. అదంతా పెద్ద కథ. పాతికేళ్ల క్రితం సుచిత్ర డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఆ గిరిజన ప్రాంతంలో అడుగుపెట్టారు. నిజానికి, ఆ ఆదివాసులకు ప్రభుత్వ అధికారులంటే భయం. ఆ ఆఫీసర్లు అడవిని నమ్ముకుని జీవిస్తున్న తమను మైదాన ప్రాంతాలకు తరలిస్తారని, తరాలనాటి సంప్రదాయాలను ప్రశ్నిస్తారని, వేషభాషల్ని నాశనం చేస్తారని అర్థంలేని అపోహ. తొలిదశలో సుచిత్రనూ అనుమానించారు. ఆ అడవి బిడ్డల అమాయకత్వాన్ని ఆమె ఓ తల్లిలా ఓపికతో భరించారు. క్రమంగా అపోహలు తొలగిపోయాయి. బంధాలు బలపడ్డాయి. సబర్ తెగకు అన్నివిధాలా అండగా నిలిచారామె.

### హస్తకళలకు ఆసరా..

గిరిజనుల జీవితం కళాత్మకం. ఇంటిని ముచ్చటగా సర్దుకుంటారు. ఒంటికి రకరకాల ఆభరణాలు సింగారించుకుంటారు. వంటపాత్రలకు ఆకట్టుకునే రంగులు వేసుకుంటారు. అవసరాలకు తగినట్టు పొందికైన వెదురు బుట్టలు అల్లుకుంటారు. ఆ సృజన చూసి అబ్బురపడ్డారు సుచిత్ర. ఆ ఉత్పత్తులను విక్రయించేందుకు ఓ వేదిక ఏర్పాటు చేసి, మార్కెట్‌తో అనుసంధానించారు. దీంతో గిట్టుబాటు ధర లభించింది.

గిరిజన మహిళల జీవితాల్లో స్వావలంబన సాధ్యమైంది. నాలుగేళ్ల క్రితం సుచిత్ర సిన్హా ఐఏఎస్ అధికారిగా ఉద్యోగ విరమణ చేశారు. అయినా, సబర్ తెగతో సత్సంబంధాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆ ఆదివాసి ప్రజల వికాసానికి ఆమె కృషిని గుర్తిస్తూ నీతి ఆయోగ్-ఐక్యరాజ్య సమితి సంయుక్తంగా 'ఉమెన్ ఇండియా ట్రాన్స్‌ఫార్మింగ్ అవార్డ్'తో సుచిత్రను సన్మానించాయి.

> **సుదీర్ఘ** ఉద్యోగ జీవితం తర్వాత.. పదవీ విరమణ చేస్తున్నప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ గిరిజనుల మొహాలు తప్పించి మరేమీ కనిపించ లేదు. ప్రతి ఇంట్లో నా ఫొటో పెట్టుకుంటున్నారు. బయటి వ్యక్తులను కలవడానికి కూడా ఇష్టపడనివారు 'అమ్మా' అంటూ నన్ను ప్రేమగా పిలుస్తున్నారు. ఇంతకుమించి ఏం కావాలి?
>
> • **సుచిత్ర సిన్హా,** విశ్రాంత ఐఏఎస్



### తొలి పరిచయం..

అప్పటికి సుచిత్ర ట్రైనీ గ్రూప్ వన్ అధికారి. జంషెడ్‌పూర్ జిల్లాలో మహిళా శిశు సంక్షేమ అధికారిగా తొలి పోస్టింగ్ ఇచ్చారు. భారత్ సేవాశ్రమ్‌కు చెందిన ఓ సన్యాసి తరచూ ఆమె కార్యాలయానికి వచ్చేవారు. మాటల సందర్భంలో సరాయికేలా-ఖర్సావా జిల్లాలోని సబర్ తెగ గురించి చెబుతూ.. ఆ తెగ అంతరించిపోతున్న దశలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు కూడా. ఆ మాట సుచిత్రను కదిలించింది. వెంటనే అక్కడికి బయల్దేరారు. తీవ్రమైన పేదరికం. పోషకాహార లోపం. ప్రతి ఒక్కరిలో ఏదో ఓ రుగ్మత. సుచిత్ర కదిలిపోయారు. ఎవరికీ జానెడు భూమి కూడా లేదు. స్థానికంగా లభించే వెదురుతో బుట్టలు అల్లుకుంటూ జీవితం సాగిస్తున్నారు. అక్కడా దళారుల సమస్యే. గిట్టుబాటు ధరలు లభించవు. వాళ్ల కోసం ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకునే సరికి.. ఢిల్లీకి బదిలీ అయ్యింది. దేశ రాజధానికి వెళ్లిన తర్వాత కూడా ఆ ఆదిమ తెగ గురించే ఆలోచనలు. జాతీయ స్థాయిలో డెవలప్‌మెంట్ కమిషనర్ (హ్యాండీక్రాఫ్ట్) అనే అధికారి ఉంటారని, ఆయనను సంప్రదిస్తే ఏదైనా పరిష్కారం దొరుకుతుందని ఆత్మీయులు సలహా ఇచ్చారు. వెళ్లి కలిశారు. సానుకూలంగా స్పందిస్తూ.. సమగ్రమైన ప్రాజెక్ట్ రిపోర్ట్ సమర్పించమని అడిగారు కమిషనర్. నిద్రాహారాలు మాని నివేదికను రూపొందించి ఇచ్చారు సుచిత్ర. నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ విద్యార్థులను తీసుకెళ్లి సబర్ ప్రజల హస్తకళలను చూపించారు. వాటిని ఆధునికంగా రీడిజైన్ చేసే బాధ్యత వారికి అప్పగించారు. ఆ ప్రయత్నమూ ఫలించింది. ఆ ఉత్పత్తులను మార్కెట్ చేయడానికి వారితో 'అంబాలిక' అనే ఎన్జీవోను ఏర్పాటు చేయించారు సుచిత్ర.

### ఒక కంపెనీగా..

కాలం మారుతున్నది. అభిరుచులు మారుతున్నాయి. కొనుగోలుదారుల అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తులను అందిస్తేనే.. మార్కెట్‌లో నిలుస్తాం, గెలుస్తాం. ఆ ప్రయత్నంలో భాగంగా సబర్ తెగలోని రెండొందల పైచిలుకు కుటుంబాలు వాటాదారులుగా.. కంపెనీల చట్టం ప్రకారం 'క్రాఫ్ట్‌ట్రైబ్ ప్రొడ్యూసర్స్ కంపెనీ' పేరుతో ఓ వ్యాపార సంస్థను నమోదు చేయించారు సుచిత్ర. ఆ బ్రాండ్ కింద వందకుపైగా ఉత్పత్తులు అందిస్తున్నారు. దేశీయ మార్కెట్‌లో నిలదొక్కుకుంటూనే.. విదేశాలకు ఎగుమతి కూడా చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఆ గిరిజనుల జీవితాలు ఎంతో మారిపోయాయి. పిల్లల్ని చదివించుకుంటున్నారు. ప్రయోజకుల్ని చేస్తున్నారు.

# ఒంటరినైపోయాను!

డియర్ జిందగీ

**నా వయసు ముప్పై ప్లస్. ఆఫీసులో బాధ్యతల కారణంగా బయటి ప్రపంచంతో దాదాపుగా సంబంధాలు తెగిపోయాయి. ఎవరి ఫంక్షన్స్‌కూ వెళ్లను. ఎలాంటి వేడుకలూ చేసుకోను. దీంతో ఎక్కడైనా తారసపడితే, పరాయిదానిలా చూస్తున్నారు. అమ్మానాన్నలు కూడా ఎక్కడో మరో రాష్ట్రంలో ఉంటారు. కొత్త సంవత్సరంలో అయినా, కొత్త జీవితం ప్రారంభించాలని నా ఆశ.**

• **ఓ పాఠకురాలు**



**బాల్య,** కౌమారాల్లో ప్రతి పరిచయాన్నీ స్నేహంగానే భావిస్తాం. చిన్నపాటి ఆత్మీయతకే కరిగిపోయి మన కథంతా వినిపిస్తాం. గుండె తేలికచేసుకుంటాం. ఎక్కడా ఎలాంటి వడపోతలూ ఉండవు. పట్టా చేతికొచ్చే సమయానికి మనలోని అచ్చమైన అమాయకత్వం మాయమైపోతుంది. ప్రతి మనిషిని శంకించడం ప్రారంభిస్తాం. ఎదుటి వ్యక్తి మాటలను భూతద్దంలోంచి గమనిస్తాం. ఆ పలకరింపులో స్వార్థం ఉందేమో అని అనుమానిస్తాం. ఆ ఆత్మీయతలో కుట్ర కోణాన్ని ఊహించుకుంటాం. ఆ వడపోత మధ్య నిజమైన స్నేహాలు కూడా పక్కకు తొలగిపోతాయి. దీంతో ప్లాస్టిక్ నవ్వులు, కృతకమైన అనుబంధాల మధ్య బతుకుతున్నామనే భావన కలుగుతుంది. ప్రస్తుతం మీరు ఈ దశలో ఉన్నారు. ఎదుటి మనిషిపై అంచనాలు పెట్టుకోవద్దు. ఫలానా విధంగానే స్పందించాలనే ఆలోచన వద్దు. యథాతథంగా ఆమోదించండి. నిజాయతీ లేని స్నేహాలు ఏదో ఓ దశలో కూలిపోతాయి. వాటిని బలవంతంగా నిలబెట్టే ప్రయత్నం వద్దు. అంతిమంగా ఒకరో ఇద్దరో మిగులుతారు. కాబట్టి, జడ్జిమెంట్ పక్కన పెట్టి జర్నీ ఎంజాయ్ చేయండి.

# అన్నీ పనిమనిషి పాత్రలే!

**రోహిణి అంటే.. 'జబర్దస్త్' రోహిణి, 'సేవ్ ద టైగర్స్' రోహిణి, త్వరలోనే 'హనుమాన్' రోహిణి కూడా! అమ్మాయిలకూ కామెడీ టైమింగ్ ఉంటుందని, పటాకుల్లాంటి పంచ్‌లు పేలుస్తారని నిరూపించింది తను. 'తర్వాత ఏంటి?' అనడిగితే చాలా విషయాలే చెప్పింది.**

చిన్నతెర



**జబర్దస్త్‌తో** నా కెరీర్ మలుపు తిరిగింది. జనాన్ని నవ్వించడంలో ఓ కిక్ ఉంటుంది. ఎదుటి మనిషిని ఏడిపించడం సులభమే. కానీ నవ్వించడం కష్టం. పగలబడి నవ్వించడం మరీ మరీ కష్టం. ఆ ప్రయత్నంలో నేను సక్సెస్ అయ్యాను. కాబట్టే, కొత్తకొత్త ఆఫర్స్ వస్తున్నాయి. 'సేవ్ ద టైగర్స్' వెబ్ సిరీస్ నుంచీ పిలుపు వచ్చింది. సినిమాకు దీటుగా ఎదుగుతున్న మీడియా వెబ్ సిరీస్. మనల్ని మనం నిరూపించుకోడానికి ఇదో అవకాశం కూడా. ప్రస్తుతం 'సేవ్ ద టైగర్స్' రెండో భాగం కూడా సిద్ధం అవుతున్నది. ప్రస్తుతం డబ్బింగ్ దశలో ఉంది. ఆ పని మీదే ఉన్నాను. ఇక, సోషల్ మీడియా అంటారా? నేరుగా జనానికి కనెక్ట్ కావడానికి అంతకుమించిన వేదిక లేదు. అందుకే, సామాజిక మాధ్యమాల్ని వీడకుండా, టీవీ షోలను వదిలిపెట్టకుండా, వెబ్ సిరీస్‌లో కనిపిస్తూ.. నాదైన కెరీర్ నిర్మించుకుంటున్నా.

### ▸▸ జాబ్ కోసం హైదరాబాద్

మాది వైజాగ్ దగ్గర్లోని ముసిడిపల్లి. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదువుకున్నా. విజయవాడలో బీటెక్ చేశాను. క్యాంపస్ ప్లేస్‌మెంట్ రావడంతో హైదరాబాద్‌లో వాలిపోయాను. ఇక్కడ స్కిల్స్ డెవలప్ చేసుకోడానికి ఓ కోచింగ్ సెంటర్‌లో చేరాను. అక్కడే, ఓ సర్ నన్ను నటన వైపు ప్రోత్సహించారు. దీంతో ఓ ఆరునెలలు ప్రయత్నించాలని నిర్ణయించుకున్నాను. ఆ జర్నీలో చిన్నపాటి చేదు అనుభవాలూ ఉన్నాయి. ఓ దశలో వెనక్కి వెళ్లిపోవాలని అనుకున్నాను. ఇంట్లో కూడా అభ్యంతరం చెప్పారు. ఏదైనా గవర్నమెంట్ ఉద్యోగం కానీ, బ్యాంక్ జాబ్ కానీ తెచ్చుకోమని సర్దిచెప్పారు. అంతలోనే నాకు నేను ధైర్యం చెప్పుకొన్నాను. 'కొంచెం ఇష్టం కొంచెం కష్టం' సీరియల్‌లో నా పాత్ర హిట్ కావడంతో.. మా వాళ్లు కూడా సంతోషించారు. చిన్నప్పటి నుంచీ అంతే నవ్వడం, నవ్వించడం నాకు ఇష్టం. అలీ గారిని, కోవై సరళ గారిని ఇమిటేట్ చేసేదాన్ని. నేను ఉన్నానంటే.. చుట్టుపక్కల సందడే సందడి.

### ▸▸ శ్రీదేవి.. నా ఫ్యాన్!

ప్రస్తుతం జబర్దస్త్‌తో పాటు 'ఆహా' ఓటీటీలో కామెడీ స్టాక్ ఎక్స్ఛేంజ్ చేస్తున్నా, జీ తెలుగులో ఫ్యామిలీ నంబర్‌వన్ పూర్తయింది. 'హనుమాన్' మూవీ విడుదల కోసం ఎదురుచూస్తున్నా. విజయ్ దేవరకొండ చిత్రంలోనూ నటిస్తున్నా. అన్నీ నా అభిరుచికి తగిన పాత్రలే. అందులోనూ పనిమనిషి క్యారెక్టర్లే ఎక్కువ. అన్నిరకాల పాత్రలూ చేయాలని నా ఆలోచన. ఎక్కడికెళ్లినా జనం గుర్తుపడుతున్నారు. పలకరిస్తున్నారు. సెల్ఫీలు అడుగుతున్నారు. శ్రీదేవి అనే అభిమాని తాను దాచుకున్న డబ్బుతో ఓ వాచీ కానుకగా పంపింది. జీవితంలో ఎప్పుడూ ఫలానా తప్పు చేశాననే పశ్చాత్తాపం ఉండకూడదు. రాత్రి ప్రశాంతంగా నిద్రపట్టాలి. ఇదే నా ఫిలాసఫీ. ఇప్పటిదాకా సాధించినదాని పట్ల సంతృప్తిగా ఉంది. అలా అని ఇక్కడితో ఆగిపోవాలని లేదు. బ్రేక్ కోసం ఎదురుచూస్తున్నా. రవితేజ గారితో మంచి కామెడీ సినిమాలో చేయాలని ఉంది. చూద్దాం!



నగ ధగలు

# గజ్జె ఘల్లు.. గుండె ఝల్లు!



**పేరుకు** ఏడువారాల నగలే కానీ.. ఏదైనా ఘల్లుమన్నాయా? వడ్డాణమనే పేరుతో వగలుపోవడమే తప్పించి.. ఫక్కున నవ్విందా? వజ్రపుటుంగరమని విర్రవీగడంతోనే సరిపోయింది. ఓ ఉలుకూ లేదు, పలుకూ లేదు. అదే, వెండి మువ్వలైతే ఆ సందడే వేరు. లోలాకులతో కలిసి కులుకుతాయి. గాజులతో ములాఖత్ అయిపోయి గలగలమంటాయి. కాలి అందెలకు చెలికత్తెలై అందగత్తె అడుగులకు మడుగులొత్తుతాయి. కాబట్టే, తేజహ్ అనే జువెలరీ కంపెనీ మువ్వలతో ముస్తాబైన వెండి ఆభరణాలను తీసుకొచ్చింది. నెక్లెస్ నుంచి పాలి పట్టీల వరకు.. ప్రతి నగకూ మువ్వల వగలు జోడించింది. చీరకట్టు మొదలు మినీ స్కర్ట్ వరకు దేనికైనా అతికినట్టు సరిపోతాయి. అతివ నడకకు నేపథ్య సంగీతం వినిపిస్తాయి. ధరలు వంద పైచిలుకుతో మొదలవుతాయి.